ఆరంభమే అవస్థలమయం

- అన్నదాతకు ప్రారంభమైన రబీ కష్టాలు
- వేధిస్తున్న పిస్టియా పువ్వు
- అరకొరగా మొలకెత్తిన విత్తనాలు
- చేలల్లో నీరు డ్రెయిన్లలోకి దిగక అవస్థలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



కూనవరంలో నాట్లకు సిద్ధం చేసిన వరి చేలలో వ్యాపించిన పిస్టియా పువ్వు

ఉప్పలగుప్తం: వరిసాగు చేసే రైతన్నకు వ్యవసాయం కన్నీటినే మిగులుస్తోంది. అయినప్పటికీ అన్నదాత నేర్చుకున్న విద్య వ్యవసాయం ఒక్కటే కావటంతో దానిపై మమకారం తగ్గక కష్ట నష్టాలు ఎదురవుతున్నా వాటికి ఎదురొడ్డి సాగుకు సన్నద్ధమవుతూనే ఉన్నాడు. అరుగాలం శ్రమించి సాగు చేయాలన్న తపనతో ఖరీఫ్ సాగు చేపట్టిన కర్షకునికి ఆది నుంచి అవాంతరాలే ఎదురయ్యాయి. నారుమడి వేసిన నాటి నుంచి కోత దశకు వచ్చే వరకు ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలకు నష్టాలను చవి చూడక తప్పలేదు. ఆ కష్టాలను ఎలాగోలా తట్టుకొని కనీసం రబీ సాగు సఫలమైనా ఖరీఫ్ నష్టం నుంచి బయట పడొచ్చని కోటి ఆశలతో ముందస్తుగా రబీ సాగును ప్రారంభించారు. అయితే ఆరంభంలోనే హంసపాదు అన్న చందంగా అప్పుడే అవస్థలు ప్రారంభమయ్యాయి. నారుమడులు వేసిన నాటి నుంచి అకాల వర్షాలు కురిశాయి. డ్రెయిన్‌లలో నీరు ఎక్కువగా ఉండిపోయి నారుమడుల్లో నీరు దిగక రైతులు మోటారు పంపులు, చేతి గుల్ల తిప్పుడు, చేతి బకెట్‌లతో నారుమడుల్లో నీటిని తోడటానికి నానా అవస్థలు పడ్డారు. వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కక పోగా వాతావరణంలోని సమశీతోష్ణ స్థితితో చలి ఎక్కువగా ఉండటంతో విత్తనాలు పూర్తి స్థాయిలో మొలకెత్తలేదు.

అధిక దిగుబడి వస్తుందన్న ఆశతో ప్రధాన రకాలైన ఎంటీ13 రకపు విత్తనాన్ని రైతులు ఎంచుకొని నాట్లు వేసినప్పటికీ అవి పూర్తి స్థాయిలో మొలకెత్తలేదు. కేవలం యాభై శాతం మాత్రమే మొలకెత్తడంతో రైతు డీలా పడ్డాడు. వీటన్నిటికీ తోడు పిస్టియా రకపు పచ్చ పువ్వు నారుమడి చేలల్లో అధికంగా వ్యాపించడంతో దానిని నివారించడానికి అదనపు పెట్టుబడి భారాన్ని మోస్తున్నామని అన్నదాతలు వాపోతున్నారు. సాగు ఆరంభంలోనే ఇలా ఉంటే రానున్న పంట కాలంలో ఇంకెన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.



వానపల్లిపాలెంలో చేతి గుల్ల సాయంతో నీరు దింపుకొంటున్న రైతులు



ఉప్పలగుప్తం పాయకరావుకోడు డ్రెయిన్‌లోకి ఇంజిన్ సహాయంతో నీటి పారబోత

నియోజకవర్గంలో..

అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో 16,534 ఎకరాల్లో రబీ సాగు జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ మండలాల్లో ఇప్పటి వరకూ కేవలం 559 ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఉప్పలగుప్తం మండలంలోని ఎస్.కొత్తపల్లి, చల్లపల్లి, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, కూనవరం, అల్లవరం మండలంలోని రెల్లుగడ్డ, అల్లవరం, ఎంట్రుకోన, అమలాపురం మండలంలో సమనస, కామనగరువు, వన్నె చింతలపూడి ప్రాంతాల్లో ఇప్పటి వరకూ కనీసం నారుమడులు వేసే పరిస్థితి లేదు. దీనికి ప్రధాన కారణం డ్రెయిన్‌లలో నీరు దిగక వరి చేలలో మూడు అడుగుల మేర నీరు నిల్వ ఉండటమే.

అమలు కాని ఆదేశాలు

ప్రకృతి వైపరీత్యాల నుంచి బయట పడాలంటే ముందస్తుగా రబీ సాగును మొదలు పెట్టి మార్చి నెలాఖరుకు పంటను కోతకు సిద్ధం చెయ్యాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి చూస్తుంటే దానికి పూర్తి విరుద్ధంగా ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఈ సమయానికి రబీ నాట్లు పూర్తయ్యి, మొదటి దఫా మందు జల్లి, రెండవ దఫాకు సిద్ధంగా ఉండేవాళ్లమని చెబుతున్నారు. నాట్లు ఆలస్యం కావటంతో పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు కురిస్తే అధోగతిపాలు కావడం తప్పదని వాపోతున్నారు. ప్రభుత్వాలు రైతుల కష్టాన్ని గమనించి హామీలను నెరవేర్చి ఊతం అందిస్తే ముందుకు సాగే అవకాశం ఉంటుందని రైతులు మొర పెట్టుకుంటున్నారు.

అదనపు భారం



సాగులో నష్టం వస్తున్నా వ్యవసాయంపై మక్కువతో ఆరెకరాల్లో వరిసాగు చేస్తున్నాను. సాగు మొదలు పెట్టిన నాటి నుంచి అవస్థలే ఎదురవుతున్నాయి. ఈ సమయానికి మొదటి దఫా మందును అందించాలి. వర్షాల కారణంగా సాగు ఆలస్యం అవుతోంది. చేల కంటే డ్రెయిన్‌లలో నీరు ఎత్తులో ఉండిపోవడంతో చేలల్లో నీరు దిగటం లేదు. దీంతో అదనంగా డీజిల్ పంపుతో నీరును బయటకు తోడుతున్నాం. దీంతో సాగు ఖర్చులతో పాటు డీజిల్ ఖర్చు అదనపు భారంగా మారుతోంది. ప్రభుత్వం ఆదుకోక పోతే వ్యవసాయం చేయలేం.

వెంకటేశ్వరరావు,
కౌలు రైతు,
వానపల్లిపాలెం,
ఉప్పలగుప్తం మండలం.

వ్యవసాయం చేయలేం



వరి చేలలో వచ్చే పిస్టియా పువ్వుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నారుమడి సిద్ధం చేయడానికి నాలుగు రోజులుగా నలుగురు మనుషులను పెట్టి పువ్వును ఏరిస్తున్నాను. వీరికి అదనంగా వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు నీరు దిగక రబీ సాగు ఆలస్యం అయింది. పిస్టియా పువ్వు రావటంతో మరింత జాప్యం జరుగుతోంది. నారుమడికి సాధారణంగా అయ్యే ఖర్చుతో పాటు పువ్వు ఏరివేతకు అదనంగా ఎకరానికి ఏడు వేల వరకు ఖర్చవుతోంది. ఇలాగైతే వ్యవసాయం చేయలేం.

యాళ్ల రవి,
రైతు,
భీమనపల్లి,
ఉప్పలగప్తం మండలం.

క్లుప్తంగా

విద్యార్థుల రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో కళాశాలకు చెందిన వంద మంది విద్యార్థులు రక్త దానం చేసి సేవా భావాన్ని చాటారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు సీహెచ్.రాజప్రకాష్, సీహెచ్ సుబ్బారావుల ప్రోత్సాహంతో విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు.

అమలాపురం డిపోకు సూపర్ లగ్జరీ బస్సుల రాక



డిపోలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొత్త బస్సులు

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపోకు కొత్తగా ఐదు సూపర్ లగ్జరీ బస్సులు వచ్చాయి. నూతన బస్సులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం ప్రారంభిస్తారని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి శనివారం తెలిపారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ రూట్లల్లో ఈ బస్సులను నడుపుతామని ఆయన తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

ముక్కోటి ఏకాదశి నిర్వహణకు సమాయత్తం



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఈవో వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 10న జరగనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆలయ ఉత్సవ కమిటీ సమావేశం నిర్ణయించింది. కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న అధ్యక్షతన ఆలయంలో శనివారం జరిగిన సమావేశంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఆ రోజు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు సంబంధించిన కర పత్రాలు, బ్రోచర్లను ఈవోతో పాటు ఉత్సవ కమిటీ చైర్మన్ అబ్బాయి వెంకన్న, కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు.

ఘనంగా లక్ష తులసి పూజ

ముమ్మిడివరం: శ్రీదేవి, భూదేవీ సమేత కేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి లక్ష తులసి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం రామ చిరంజీవి ఆచార్యులు, పెద్దింటి శ్రీనివాసాచార్యులు స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు, లక్షతులసి పూజ నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆర్డీవో కె.మాధవి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. అనంతరం వారివురూ విద్యార్థినులతో కలిసి సహ పంక్తి భోజనాలు చేశారు. జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శనివారం నుంచి మధ్యాహ్న భోజనాలు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు ఆర్డీవో మాధవి పేర్కొన్నారు. అనంతరం సమీపంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆర్డీవో, ఎమ్మెల్యేలు పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు గండి హారిక, పిండి అమరావతి, కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.కృష్ణ కిషోర్, మహాత్మా గాంధీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ శనివారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రశాంతి, నగర పంచాయతీ మేనేజర్ పి.నూకరాజు, కోఆర్డినేటర్ సురేష్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి యోగితా రాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో మాధవి, ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

తాళ్లరేవు: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించే డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని శనివారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావుతో కలిసి ప్రారంభించారు. స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, కుడుపూడి శివన్నారాయణ, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, నడింపల్లి వినోద్, రోళ్ల చక్రవర్తి, అత్తిలి బాబూరావు, టి.ఈశ్వరరావు ఎంఈఓ మంగాయమ్మ, ఉమ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్లాక్ లెవెల్ ఆటల పోటీలు

యానాం: యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బ్లాక్‌లెవెల్ స్పోర్ట్స్ మీట్‌లో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, స్కిప్పింగ్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి తిర్రి గోపీ మాట్లాడుతూ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీసే ఉద్దేశ్యంతో బ్లాక్‌లెవెల్ ఆటల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినాయకరావు, సోమేష్, వీరకుమార్, యువకేంద్ర సిబ్బంది మన్నె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విజేతలు

వైజ్ఞానిక ప్రదర్శనలో గురుకులం విద్యార్థిని ప్రతిభ

అల్లవరం: పి.గన్నవరం ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనల్లో గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం విద్యార్థిని కె.శాల్విన ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ కిరణ్మయి ఆదివారం తెలిపారు. మేజిక్ హోమ్ బ్రెల్లా అంశంపై ఉపాధ్యాయురాలు మౌనిక పర్యవేక్షణలో చేసిన ప్రదర్శనకు ప్రథమ స్థానం దక్కిందన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని శాల్వినకు డీఈఓ సలీమ్ భాష అవార్డు అందించారని తెలిపారు. ఉపాధ్యాయురాలు మౌనిక, విద్యార్థిని శాల్వినను పలువురు అభినందించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని శాల్వినను అభినందిస్తున్న అధికారులు

కలెక్టరేట్‌లో పాము కలకలం



పామును బంధిస్తున్న వర్మ

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి భవనంలో శనివారం ఆరడుగుల జెర్రిపోతు పాము హల్‌చల్ చేసింది. అధికారులు ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలోని స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకొన్న వర్మ రెండు గంటలు శ్రమించి పామును చాకచక్యంగా బంధించారు.

బాలికా విద్యతోనే ప్రగతి

ముమ్మిడివరం: కిశోర బాలికల పట్ల తల్లిదండ్రులు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సీడీపీఓ ఐ.విమల సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ×కిశోర వికాశం₹ అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు.

బేటీ బచావో బేటీ పడావో పథకంలో భాగంగా బాలికలకు పౌష్టికాహార ఆవశ్యకతను వివరించారు. నగర పంచాయతీ కమిషనర్ పి రవివర్మ, ఎంపీడీఓ టి.వెంకటాచార్యలు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం వల్ల వ్యక్తిగత వికాసం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి యోగితా రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దతుదారులతో సమావేశం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో బీజేపీ ఘోర ఓటమి అనంతరం శనివారం బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు హోటల్‌లో మాజీ కేంద్రమంత్రి రాజు చంద్రశేఖర్, ఇన్‌చార్జి నిర్మల్‌కుమార్ సురేనా ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అనంతరం వారు సీఎం రంగసామితో సమావేశమయ్యారు. స్పీకర్ సెల్వం తీరుకు నిరసనగా ఆయనపై అవిశ్వాసానికి అంగలన్, నెహ్రూ, శివశంకరన్ అసెంబ్లీ కార్యదర్శికి నోటీసులు ఇచ్చారు. రొటేషన్ విధానం ద్వారా కేబినెట్‌లో మంత్రులను మార్చాలని బీజేపీ కోరింది. అసంతృప్త బీజేపీ ఎమ్మెల్యేలు రిచర్డ్, జాన్‌కుమార్, కల్యాణ సుందరం, వెంకటేషన్, అశోక్‌బాబు, రామలింగం, మంత్రులు శాయిశర్వణ్, నమశ్శివాయం పాల్గొన్నారు. మద్దతునిస్తున్న ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు అంగలన్, శివశంకరన్ సమావేశానికి వచ్చినప్పటికీ బీజేపీ అధిష్టానంతో మాట్లాడకుండా వాకౌట్ చేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షలకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతునట్లు జిల్లా బీసీ సంక్షేమ సాధికర అధికారి పి.సత్య రమేష్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన వంద మంది, ఈబీసీ కులాలకు చెందిన 20 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్‌ను అందజేస్తారన్నారు. అభ్యర్థులు బీఈడీ, టీటీసీలతో పాటు టెట్ పరీక్షలో అర్హత సాధించి ఉండాలన్నారు. ఏపీ టెట్‌లో అత్యధిక మార్కులు పొందిన వంద మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో విద్యార్హత, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఇతర ధృవపత్రాలతో జనవరి 20వ తేదీ లోపు అమలాపురంలోని జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 7093401225, 9440403629 నెంబర్లలను సంప్రదించాలన్నారు.

బాపన్నకు నివాళి

అమలాపురం టౌన్: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు లేఖర్ల సహాయకుడిగా పనిచేస్తున్న కోటిపల్లి బాపన్న (57) అనారోగ్యంతో మృతి చెందారు. కోనసీమ డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండర్ల సంఘానికి చెందిన ప్రతినిధుల ఆధ్వర్యంలో అమలాపురం రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం సంతాప సభ జరిగింది. బాపన్న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు శనివారం సంతాప సెలవుగా పాటించి విధులను నిర్వర్తించలేదు. కోనసీమ స్టాంపు వెండర్లు, దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు జిన్నూరి సురేష్, ఎం.కామేశ్వరరవు, మట్టపర్తి రాము, దుర్గారావు, గోపాల్, మహేష్, సుబ్బు, మణికంఠ, గోకరకొండ బుజ్జి తదితరులు పాల్గొని బాపన్న మృతికి సంతాపం తెలిపారు.

కల్యాణ మండపానికి రూ.50వేల విరాళం

ముమ్మిడివరం: స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపం నిర్మాణ పనులు పూర్తి చేయడానికి అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం ముమ్మిడివరం సంఘ పెద్దలకు ఆయన అందజేశారు. కార్తీక వన సమారాధనలో భాగంగా అసంపూర్తిగా ఉన్న శెట్టి బలిజ సంఘ భవన నిర్మాణానికి తన వంతు ఆర్థిక సాయం చేస్తానని ఇచ్చిన హామీ మేరకు రూ.50 వేలు అందజేసిన శ్రీనివాసరావును సంఘ పెద్దలు అభినందించారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాస్ చంద్రబోస్, ఆయన తనయుడు పిల్లి సూర్యప్రకాష్‌లను కలిసి భవన నిర్మాణం గురించి సంఘ పెద్దలు వివరించారు. దీంతో రాజ్యసభ నిధుల నుంచి రూ.20 లక్షల గ్రాంటు ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు శ్రీనివాసరావుతో పాటు సంఘ పెద్దలు తెలిపారు.

7 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ముమ్మిడివరం: ఈ నెల 7 నుంచి కోనసీమ క్రీడోత్సవంలో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.వెంకటాచార్య తెలిపారు. ముమ్మిడివరం జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలలు, ఎంజీఆర్ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణాలలో ఈ పోటీలు 7, 8, 9వ తేదీలలో జరుగుతాయన్నారు. జూనియర్ విభాగంలో 4, 5, 6 తరగతి విద్యార్థులకు 100, 200 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, బాల్‌త్రో పోటీలు, సీనియర్ విభాగంలో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాట్మింటన్, క్రికెట్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ

ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి మాధవి

అమలాపురం రూరల్: ప్రపంచంలోని అంధులకు లూయిస్ బ్రెయిలీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించి భావ వ్యక్తీకరణకు అవకాశం కల్పించారని జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి, ఆర్డీవో కె.మాధవి అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో బ్రెయిలీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. పదకొండేళ్ల సుదీర్ఘ పరిశోధనల అనంతరం అభివృద్ధి చెందిన సరళ పద్ధతిలో చుక్కల లిపిని బ్రెయిలీ కనుగొన్నాడని ఈ లిపికి ఆయన పేరు మీదుగానే నామకరణం చేయడంతో బ్రెయిలీ లిపి అని పేరు వచ్చిందన్నారు. బ్రెయిలీ లిపిని అభివృద్ధి చేయడంతో దానిని సద్వినియోగం చేసుకొని ఎంతో మంది అంధులు విద్యావేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, చిత్రకారులుగా అనేక రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ముద్రించిన బ్రెయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంధులకు మూడు చక్రాల సైకిళ్లు అందించారు. ఎంపీటీసీ సభ్యులు మోటూరు కనకదుర్గారావు, వెంకటేశ్వరరావు సమకూర్చిన దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు, ఇన్‌చార్జి సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, అంధుల సంఘం నాయకులు పాల్గొన్నారు. దివ్యాంగులకు చేస్తున్న సేవలను గుర్తించి ఈదరపల్లి హరి మనో వికాస కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాజశేఖర్‌ను ఇన్‌చార్జి సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు ఘనంగా సన్మానించారు.



అమలాపురంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి డీఆర్ఓ మాధవి

బండారులంక ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం ఎస్ఎల్‌వి బాలా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్.దుర్గాదేవి పాల్గొని ప్రసంగించారు. అంధులకు లూయి ఒక దిక్సూచి అని వైకల్యం ఎదుగుదలకు ఏమాత్రం అడ్డు కాదన్నారు. పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అంధులకు లిపిని సృష్టించి వారిలో విజ్ఞాన కాంతులు నింపిన లూయిస్ బ్రెయిలీ వారికి ఆరాధ్య దైవమని వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర అన్నారు. స్థానిక లూయిస్ అంధుల పాఠశాలలో అంధ విద్యార్థుల సమక్షంలో శనివారం జరిగిన బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో ప్రొఫెసర్ నాగేంద్ర మాట్లాడారు. అమలాపురం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, ఇతర వాకర్స్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు అల్పాహారం సమకూర్చి కొంత నగదును అందజేశారు. వాకర్స్ క్లబ్ సంయుక్త కార్యదర్శి కుడుపూడి త్రినాథ్, వాకర్స్ ప్రతినిధులు పుత్సా కృష్ణ కామేశ్వర్, రంకిరెడ్డి కాశీ, పడాల బాబి, గోటేటి గంగాధర్, వైఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.



అమలాపురంలో బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ నాగేంద్ర, గవర్నర్ నాగేశ్వరరావు తదితరులు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి విద్యార్థులకు బ్రెయిలీ లిపి ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు ఎస్కే అలీ, నారాయణమూర్తి, శ్రీదేవి, సూర్య ప్రభ, సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్పవ్యక్తి లూయిస్ బ్రెయిల్ అని ఎంఈవో సత్తి సత్యకృష్ణ అన్నారు. ప్రపంచ అంధుల దినోత్సవాన్ని పుస్కరించుకొని ఉప్పలగుప్తంలోని భవిత సెంటరులో లూయిస్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గొల్లవిల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన దివ్యాంగుడు సూధా లక్ష్మీనారాయణకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో గొల్లవిల్లి హెచ్ఎం లంకా రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం భవిత సెంటర్లో లూయిస్ బ్రెయిలీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో సత్యకృష్ణ తదితరులు

పదకొండు మంది బైండోవర్

అమలాపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పదకొండు మంది నిందితులను శనివారం బైండోవర్ చేసినట్లు సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. వీరిని ఆయా మండలాల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌ల ముందు హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీలు విధించారని చెప్పారు. బెల్ట్ షాపుల నిర్వహణ పరంగా వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అమలాపురం మండలంలో ముగ్గురు పాత నేరస్తులు, అంబాజీపేట మండలంలో అయిదుగురు, అల్లవరం మండలంలో ముగ్గురు నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.